క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో ఆరిగంగమ్మకు బోనాలు

కలికిరి : మండలంలోని మర్రికుంటపల్లి గ్రామం సీఎం కురవపల్లిలో బుధవారం తెల్లవారు జామున ఆరిగంగమ్మకు భక్తులు భక్తిశ్రద్ధలతో బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ ఊరేగింపుగా మహిళలు దీలు, బోనాలతో ఆలయం వద్దకు చేరుకున్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తిగీతాలు ఆలపించారు. ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన రంగురంగుల విద్యుత్‌దీపాలంకరణ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

ఎంఈఓలకు సన్మానం

మదనపల్లె సిటీ : మదనపల్లె విద్యాశాఖ డివిజన్ పరిధిలో ఎంఈఓ–2లుగా నియమితులైన వారిని మంగళవారం స్థానిక ఎంఈఓ కార్యాలయంలో సన్మానించారు. ఎంఈఓ–2లుగా నియమించిన రాజగోపాల్, సుబ్రమణ్యం, సుబ్బరాయుడులను శాలువలు కప్పి సన్మానించారు. వీరితో పాటు డీవైఈఓ క్రిష్ణప్ప, ఎంఈఓ ప్రభాకర్‌రెడ్డిలను కూడా సన్మానించారు. కార్యక్రమంలో లక్ష్మీనారాయణ, కేశవరెడ్డి, ప్రసాద్, వెంకటేష్, సహదేవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వెంకటరత్నంకు సన్మానం

వాల్మీకిపురం : మండల విద్యాశాఖ అధికారి–1గా బాధ్యతలు చేపట్టిన వెంకటరత్నంను బుధవారం యూటీఎఫ్ నాయకులు ఘనంగా సన్మానించారు. స్థానిక ఎంఈవో కార్యాలయంలో ఆయనను కలుసుకొని, పూలమాల వేసి, దుశ్శాలువతో సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాలను పాటిస్తూ మండలంలో ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు బాలాజీ, నాగరాజ, వెంకటనారాయణ, హరి, అనిల్ కుమార్ రెడ్డి, బసంత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టు కాలనీకి తాగునీటి సౌకర్యం



బోరును ప్రారంభిస్తున్న సర్పంచ్ జయలక్ష్మీదేవి

పీలేరు : స్థానిక తిరుపతి రోడ్డు మార్గంలోని పీవీ మిథున్‌రెడ్డి జర్నలిస్టు కాలనీకి తాగునీటి సౌకర్యం కల్పించారు. బోడుమల్లువారిపల్లె గ్రామ పంచాయతీ నిధులు రూ. 3.50 లక్షలు వెచ్చించి స్కీం బోరుకు కొత్తగా మోటారు, స్టార్టరు ఏర్పాటు చేయడం తోపాటు కాలనీలోని అన్ని వీధులకు పైపులైన్లు ఏర్పాటు చేశారు. బుధవారం సర్పంచ్ బి.సి. జయలక్ష్మీదేవి పూజలు నిర్వహించి స్విచ్ ఆన్‌చేసి నీటిని వదిలారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జర్నలిస్టు కాలనీ అభివృద్ధికి తమవంతు సహకారం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు జ్ఞానశేఖర్‌రెడ్డి, కాలనీ చిన్న, పలువురు జర్నలిస్టులు పాల్గొన్నారు.

సన్నాహక సదస్సును విజయవంతం చేయండి



మాట్లాడుతున్న ఎంఆర్‌పీఎస్, ఎంఎస్‌పీ నాయకులు

ములకలచెరువు : ఈ నెల 12న జిల్లా కేంద్రం రాయచోటిలో జరిగే ఎంఆర్‌పీఎస్, ఎంఎస్‌పీ జిల్లా సన్నాహక సదస్సును విజయవంతం చేయాలని నియోజకవర్గ నాయకులు దుమ్ము చిన్నా, ప్రతాప్‌కుమార్ పిలుపునిచ్చారు. బుధవారం ములకలచెరువు, కురబలకోటకు మండలాలకు చెందిన నాయకులతో వారు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మంద క్రిష్ణమాదిగ హాజరవుతున్న ఈ సదస్సును విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో తిరుపాలు, రమణ, తెట్టు కుమార్, డేగాని కుమార్, సుధాకర్, నరసింహులు, మబ్బు చంద్ర పాల్గొన్నారు.

పౌష్టికాహార కేంద్రాలుగా అంగన్‌వాడీలు



అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న ఎంపీపీ శ్రీదేవి

కలకడ : పౌష్టికాహార కేంద్రాలుగా ప్రతి అంగన్‌వాడీ కేంద్రం ఉండాలని ఎంపీపీ శ్రీదేవి అన్నారు. బుధవారం మండలంలోని కలకడ ఇందిరమ్మ కాలనీ అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. విద్యార్థులు, గర్భిణులు, బాలింతలకు, కిశోర బాలికలకు ప్రభుత్వం పౌష్టికాహారం అందిస్తోందని గుర్తు చేశారు. బలవర్ధకమైన ఆహారం చిన్నారులకు అందించడానికి ప్రభుత్వం ఎంత ఖర్చు అయినా వెనుకాడటం లేదని, వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కేంద్రాల్లో హాజరు శాతం పెంచాలని, గుడ్లు, పాలు, బాలామృతం వంటివి అందరికీ సకాలంలో అందించాన్నారు.

అన్నట్లుగానే అన్నదాతకు చేయూత

- ప్రభుత్వ సాయంతో ఖరీఫ్ సాగు పనుల్లో రైతులు బిజీ
- నియోజకవర్గంలో 54,982 రైతులకు రూ.41.22 కోట్ల రైతు భరోసా సొమ్ము
- 9,125 క్వింటాళ్ల సబ్సిడీ వేరుశనగ విత్తనకాయల పంపిణీ
- ఆర్బీకేల్లో సిద్ధంగా ఉంచిన సబ్సిడీ ఎరువులు
- వేరుశనగ సాగు ప్రారంభించిన రైతులు



గంగిరెడ్డి పల్లెలో ట్రాక్టర్‌తో వేరుశనగ విత్తనాలు వేస్తున్న రైతులు

మండలం	రైతుభరోసా అర్హుల సంఖ్య	మంజూరైన నగదు రూ.కోట్లులో
పీలేరు	11165	8.37
గుర్రంకొండ	7515	5.63
వాల్మీకీపురం	9320	6.99
కలికిరి	10987	8.24
కేవీపల్లె	9254	6.94
కలకడ	6741	5.05

గుర్రంకొండ : ఖరీఫ్ పంటల సాగు కోసం ముందుగానే ప్రభుత్వం రైతులకు రైతుభరోసా నగదును వారి బ్యాంకుఖాతాల్లో జమ చేసింది. దీంతో ఖరీఫ్ సీజన్‌లో ముఖ్యంగా వేరుశనగ రైతులకు ఇది ఎంతో ఊరట నిచ్చింది. ఇప్పటికే గ్రామాల్లో వేరుశనగ పంట సాగు ప్రక్రియ మొదలైంది. నియోజకవర్గం మొత్తం మీద 54,982 మంది రైతులకు రూ.41.22 కోట్లు రైతు భరోసా నగదు అందింది. నియోజకవర్గంలోని అన్ని ఆర్బీకేల పరిధిలో మొత్తం 9,125 క్వింటాళ్ల వేరుశనగ విత్తనకాయల్ని పంపిణీ చేశారు. అన్ని ఆర్బీకేల్లో పంటల సాగుకు అవసరమైన సబ్సిడీ ఎరువులను రైతులకు అందుబాటులో ఉంచారు. దీంతో రైతులు వేరుశనగ సాగు పనులు ప్రారంభించారు.

వేరుశనగ సాగుకు చేయూత

రైతుభరోసా పథకం ఖరీఫ్ సీజన్‌లో అందులోనూ వేరుశనగ రైతులకు ఎంతో చేయూతనిచ్చింది. పంటల సాగు భారంగా మరిన సమయంలో ప్రభుత్వం రైతులకు ప్రకటించిన రైతు భరోసాతో వ్యవసాయం వైపు రైతులు ఆసక్తిచూపుతున్నారు. ప్రస్తుతరం వర్షాలు కురుస్తుండడంతో వేరుశనగ సాగు పనులు ఊపందుకొన్నాయి. అప్పులు చేసి పంటలు సాగు చేయాల్సిన పరిస్థితి నెలకొన్న ఈ తరుణంలో రైతుభరోసాతో రైతులు ఊపిరి పీల్చుకొన్నారు. ఎకరం సాగుకు అవసరమైన వేరుశనగ విత్తనకాయల కొనుగోలు, పొలాల దుక్కులు సైతం రైతు భరోసాతో తీరాయి.

సాగుకు ముందే రైతు భరోసా నగదు జమ

పీలేరు నియోజకవర్గంలోని ఆరు మండలాల పరిధిలో మొత్తం 54.982 మంది రైతులకు రూ.41.22 కోట్ల రైతు భరోసా నగదు వారి వారి బ్యాంకు ఖాతాల్లో పంటల సాగుకు ముందే ప్రభుత్వం జమ చేసింది. రైతుల ఖాతాల్లో నగదు చేరడంతో బ్యాంకులకెళ్లి నగదు డ్రా చేసుకొని వేరుశనగ పంటసాగుకు ఖర్చు చేసుకొంటున్నారు.

విత్తనకాయల పంపిణీ

నియోజకవర్గంలోని ఆరు మండలాల పరిధిలో ఇప్పటికే ఆర్బీకేల ద్వారా 9.125 క్వింటాళ్ల వేరుశనగ విత్తనకాయల్ని వ్యవసాయశాఖ అధికారులు పంపిణీ చేశారు. పదిహేను రోజుల కిందటే అన్ని ఆర్బీకేల పరిధిలో విత్తనాల పంపిణీ ప్రక్రియ పూర్తి అయ్యింది. దీంతో రైతులు విత్తనకాయల్ని తొలిచి మంచి విత్తన గింజలను పొలాల్లో విత్తడానికి సిద్ధం చేసుకొన్నారు.

ఆర్బీకేల్లో అందుబాటులో ఎరువులు

ఖరీఫ్‌సీజన్‌లో సాగు చేసే పంటలతో పాటు వేరుశనగ పంట సాగుకు అవసరమైన ఎరువులు సబ్సిడీపై రైతులకు అందించేందుకు గానూ వ్యవసాయశాఖ అధికారులు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా నియోజకవర్గంలోని ఆరు మండలాల పరిధిలోని అన్ని ఆర్బీకేల్లో యూరియా, కాంప్లెక్స్‌లు, డీఏపీ వంటి ఎరువులను రైతులకు సబ్సిడీపై అందించేందకు అందుబాటులో ఉంచారు. వీటితోపాటు కొన్ని రకాలయ రసాయనిక మందులు, పురుగుల నివారణ మందులు కూడా ఆర్బీకేల్లో అందుబాటులో ఉంచారు.

22.542 హెక్టార్లలో వేరుశనగ సాగు

నియోజకవర్గంలోని ఆరు మండలాల పరిధిలో మొత్తం 22,542 హెక్టార్లలో ఖరీఫ్ సీజన్‌లో వేరుశనగ పంట సాగుకు రైతులు సన్నద్ధం అవుతున్నారు. పడమటి ప్రాంతాల్లో ముఖ్యమైన వర్షాధార పంట వేరుశనగ కావడం గమనార్హం. సకాలంలో రైతుభరోసా డబ్బులు అందడంతో విత్తన కాయలు కొనుగోలు నుంచి విత్తనాలు పొలాల్లో చల్లే పనులు ఊపందుకొన్నాయి.

పెట్టుబడి సాయంతో పంట పనులు



రైతు భరోసా సొమ్ముతో పంటల సాగుకు అవసరమైన పెట్టుబడి సాయం అందినట్లు అయ్యింది. ఈ సీజన్‌లో వేరుశనగ పంట సాగు చేసే రైతులకు ఎంతో మేలు జరిగింది. పంటల దుక్కులు చేసుకొవడానికి, విత్తనకాయలు కొనుగోలు చేసుకోవడానికి ఆర్థిక ఇబ్బందులు తప్పాయి.

- వెంకటరమణ, మొరంపల్లె

అప్పుల బాధ తీరింది



వేరుశనగ పంట సాగు కాలం ప్రారంభమైతే పెట్టుబడి కోసం అప్పులు చేసేవాళ్లం. ప్రస్తుతం ప్రభుత్వం ముందుగానే రైతు భరోసా నగదు జమ చేయడంతో ఎంతో మేలు జరిగింది. పంటల సాగు కోసం అప్పులు చేసే బాధ తప్పింది. వేరుశనగ సాగుకు బెంగలేదు.

- చలపతి, గుట్టపల్లె

ఆర్‌బీకేల ద్వారా సేవలు



ఖరీఫ్ సీజన్లో వేరుశనగ పంటల సాగు ఇప్పుడిప్పుడే ప్రారంభమైంది. రైతులకు అవసరమైన అన్ని రకాల సేవలను ఆర్‌బీకేల ద్వారా పొందవచ్చు. రైతులకు అవసరమైన సబ్సిడీ వేరుశనగ విత్తనకాయలు ఎరువులు సిద్ధంగా ఉంచాం. పంటలసాగుకు అవసరమైన అన్ని చర్యలు చెపట్టాం.

-రత్నమ్మ, వ్యవసాయాధికారి, గుర్రంకొండ

సమస్యల పరిష్కారమే ధ్యేయం

నిమ్మనపల్లె : ప్రజా సమస్యల పరిష్కారమే గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమ ఉద్దేశమని ఎమ్మెల్యే నవాజ్‌బాషా అన్నారు. బుధవారం రెడ్డివారిపల్లె పంచాయతీలోని పిట్టావాండ్లపల్లె, వడ్డిపల్లె క్రాస్, ఎనుకొండవారిపల్లె తదితర గ్రామాల్లో సర్పంచ్ రెడ్డెమ్మ, వైఎస్సార్ సీపీ నాయకులు నరేంద్రరెడ్డి ఆధ్వర్యంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎంపీపీ నరసింహులు, సింగిల్‌విండో అధ్యక్షులు రెడ్డిశేఖర్‌రెడ్డి, ఆర్‌బీకే చైర్మన్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, మండల సచివాలయాల కన్వీనర్ రామమోహన్‌రెడ్డి, గారబురుజు రమణారెడ్డిలతో కలసి ఎమ్మెల్యే గ్రామంలోని ప్రతి ఇంటికీ వెళ్లి లబ్ధిదారులను కలిశారు. ప్రభుత్వం నాలుగేళ్లుగా అందించిన సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను లబ్ధిదారులకు అందించి, సంక్షేమ పథకాల ద్వారా పొందిన సాయాన్ని వివరించారు. స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు సుబ్రహ్మణ్యం, చంద్రాయుడు, నాయకులు హరిబాబు, రామచంద్ర, రమణ, వెంకటరమణారెడ్డి, శ్రీరాములు, కృష్ణమూర్తి, దుర్గాప్రసాద్, విజయ్‌కుమార్‌రెడ్డి, శశిధర్‌రెడ్డి, డీటీ సిరాజుద్దీన్, ఏఈలు హరినాథ్‌రెడ్డి, వసంతకుమార్‌రెడ్డి, అమరనాథ్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడా సంబరాలపై అవగాహన కల్పించాలి

గుర్రంకొండ : ఆడుదాం ఆంధ్రా క్రీడా సంబరాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఎంపీడీఓ వెంకటేశులు, ఎంఈఓ సురేంద్రబాబు అన్నారు. బుధవారం స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో హెడ్మాస్టర్లు, పీడీ, పీఈటీలతో వారు సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెలాఖరు నుంచి ఆంధ్రా క్రీడా సంబరాలు మొదలవుతాయన్నారు. ముందుగా పాఠశాలల పరిధిలో పోటీలు నిర్వహించి అందులో గెలుపొందిన వారిని మండల స్థాయిలో,మండల స్థాయిలో గెలుపొందిన వారిని నియోజకవర్గస్థాయిలో, అక్కడ నుంచి జిల్లా స్థాయిలో జరిగే పోటీల్లో గెలుపొందిన వారు పాల్గొంటారన్నారు. గ్రామాల్లో 5 నంచి 18 సంవత్సరాలు లోపు వయస్సు కలిగిన ప్రతి ఒక్కరు ఈ పోటీల్లో పాల్గొనవచ్చన్నారు.

రాత్రి వేళ షాపులు నిర్వహిస్తే చర్యలు



మాట్లాడుతున్న డీఎస్పీ కేశప్ప, వన్‌టౌన్ సీఐ మహబూబ్‌బాషా

మదనపల్లె : పట్టణంలోని హోటళ్లు, కిరాణాషాపులు, బడ్డీకొట్టులు, ఇతర దుకాణాలు ప్రతిరోజు రాత్రి 10.30 గంటలకు కచ్చితంగా మూసివేయాలి. అలా కాకుండా షాపులు నిర్వహిస్తే చర్యలు తప్పవని డీఎస్పీ కేశప్ప హెచ్చరించారు. బుధవారం వన్‌టౌన్ సీఐ మహబూబ్‌బాషా ఆధ్వర్యంలో డీఎస్పీ కార్యాలయంలో హోటళ్లు, టీ షాపులు, దుకాణాల యజమానులతో ప్రత్యేక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ రాత్రి వేళల్లో 10.30 గంటల తర్వాత షాపులు తెరిచి ఉండటంతో నేరాల సంఖ్య గణనీయంగా పెరుగుతోందన్నారు. పోలీసులు షాపులు మూసేయాలని పదే పదే హెచ్చరిస్తున్నా.. వారు వెళ్లిపోయిన తర్వాత తెరచుకుని వ్యాపారాలు నిర్వహిస్తుండటంతో చట్టవ్యతిరేక కార్యకలాపాలు జరుగుతున్నాయన్నారు. యువకులు అర్ధరాత్రి వరకు రోడ్లపై సంచరిస్తుండటం, గొడవలు పడుతుండటం, బైక్ రేసింగులు, మద్యానికి, ఇతర దురలవాట్లకు బానిసలుగా మారుతున్నారన్నారు. ఇటీవల కాలంలో రాత్రి 11 తర్వాత ద్విచక్రవాహన ప్రమాదాలు అధికమవుతున్నాయన్నారు. తల్లిదండ్రులు మైనర్లకు వాహనాలిస్తే చర్యలు తప్పవన్నారు. నేరాల నియంత్రణలో వ్యాపారులు పోలీసుశాఖతో సహకరించాలన్నారు. వన్‌టౌన్ సీఐ మహబూబ్‌బాషా మాట్లాడుతూ.. మదనపల్లె అంతరాష్ట్ర సరిహద్దు పట్టణం కావడంతో ఇతర రాష్ట్రాల్లో నేరాలు చేసిన వ్యక్తులు అర్ధరాత్రి ఇక్కడ వస్తున్నారన్నారు. మదనపల్లెలో శాంతిభద్రతల పరిరక్షణకు, నేరాల నియంత్రణకు వ్యాపారులు, ప్రజలు తమవంతు సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు.

138 మందికి ఉచిత కంటి వైద్య పరీక్షలు



కంటి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్లు

వాల్మీకిపురం : షిరిడిసాయి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో బుధవారం స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. తిరుపతి అరవింద్ కంటి ఆసుపత్రి సహకారంతో నిర్వహించిన శిబిరంలో 138 మందికి పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు అందించారు. వీరిలో 48 మందిని శస్త్ర చికిత్సలకు ఎంపిక చేసినట్లు డాక్టర్లు వినయశ్రీ, ఆకాష్ తెలిపారు. ట్రస్ట్ ఆధ్వర్యంలో మరిన్ని సేవా కార్యక్రమాలను విస్తృతం చేస్తామని సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు చింతల ఆనంద రెడ్డి, నీళ్లభాస్కర్, కేశవ రెడ్డి, క్రిష్ణమూర్తి, పిఆర్‌వో జీవన్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

కూలీలు కోరిన పనులు కల్పించాలి

తంబళ్లపల్లె : ఉపాధిహామీ పథకం ద్వారా ఉపాధి హామీ కూలీలకు కోరిన పనులు కల్పించాలని ఎంపీడీఓ సురేంద్రనాథ్ తెలిపారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధి సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. పంచాయతీలవారి జరుగుతున్న పనులు, కూలీలలకు చెల్లించాల్సిన బిల్లులపై ఆరా తీశారు. ఉపాధిహామీ పథకంలో రైతులకు ఉపయోగపడే పనులకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. రైతులను చైతన్య పరిచి పండ్లతోటలు, పూలతోటలు పెంచుకునేలా చర్యలు చేపట్టాలన్నారు. ప్రతి టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు వారి పరిధిలో ఎక్కువ కూలీలు పనులలో పాల్గొనేలా చొరవ చూపాలన్నారు. ఏపీవో అంజనప్ప, ఉపాధి ఇంజనీర్ రామన్న పాల్గొన్నారు.

కురుబలకు రాజకీయ అవకాశాలు కల్పించండి

మదనపల్లె : రాయలసీమలోని కురుబలకు రానున్న సార్వత్రిక ఎన్నికల్లో అధిక స్థానాలను కేటాయించి రాజకీయంగా అవకాశాలను కల్పించాలని సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి ఏపీ కురుబసంఘం రాష్ట్ర అధ్యక్షులు జబ్బల శ్రీనివాసులు కోరారు. బుధవారం సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఢిల్లీ పర్యటన సందర్భంగా బీసీ నాయకులు, రాజ్యసభసభ్యులు ఆర్.కృష్ణయ్య ఆధ్వర్యంలో కురుబసంఘ నాయకులు జబ్బల శ్రీనివాసులు సీఎంను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. రాష్ట్ర మంత్రివర్గంలో 30 ఏళ్ల తర్వాత కురుబకులానికి అవకాశం కల్పించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. బీసీల సమస్యలపై వినతి పత్రం సమర్పించినట్లు చెప్పారు. అలాగే లోక్‌సభ ప్యానల్ స్పీకర్, రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డిమిథున్ రెడ్డిని బీసీ సంఘాల నాయకులైన కత్రివేణుమాధవ్, డాక్టర్.మారిష్, డాక్టర్.వెంకటరమణ, బత్తులహరిప్రసాద్‌తో కలిసి బీసీ సమస్యలపై చర్చించామన్నారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ

మదనపల్లె సిటీ : స్థానిక రాంరెడ్డి లేఅవుట్‌లోని వివేకానంద మున్సిపల్ ఉన్నత పాఠశాలలో మంగళవారం డీవైఈఓ క్రిష్ణప్ప మధ్యాహ్న భోజనంను తనిఖీ చేశారు. మెనూ ప్రకారం భోజనం వడ్డించాలని సూచించారు. భోజనం రుచి చూశారు. ప్రతి రోజూ పర్యవేక్షించాలని హెచ్‌ఎంను ఆదేశించారు. పాఠశాలలో జరుగుతున్న అడ్మిషన్ల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎంఈఓ–2 రాజగోపాల్, హెచ్‌ఎం రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రికార్డులు చూపించి ద్విచక్ర వాహనాలు తీసుకెళ్లండి

మదనపల్లె : పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో విడిచి వెళ్లిపోయిన, ఎలాంటి ఆధారాలు లేని ద్విచక్రవాహనాలను సీజ్ చేశాం, ఎవరివద్దనైనా రికార్డులుంటే టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో చూపించి వాహనాలు తీసుకెళ్లవచ్చని సీఐ మురళీకృష్ణ తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ..ఇటీవల కాలంలో పట్టణంలో పలుచోట్ల వదిలేసి వెళ్లిన ద్విచక్రవాహనాలను గుర్తించి స్టేషన్‌కు తీసుకువచ్చామన్నారు. రికార్డులు కలిగిన యజమానులు వస్తే వాహనాలను అప్పగించేందుకు సిద్ధంగా ఉన్నామని, లేనిపక్షంలో కోర్టు ఉత్తర్వుల మేరకు బహిరంగ వేలం నిర్వహిస్తామన్నారు.

జగన్ పాలనలో ప్రతి కుటుంబానికి ఆర్థిక భరోసా



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న మాజీ ఎమ్మెల్యే జి.వి. శ్రీనాథరెడ్డి

పీలేరు : ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రతి కుటుంబానికి ఆర్థిక భరోసా లభించినట్లు మాజీ ఎమ్మెల్యే జి.వి. శ్రీనాథరెడ్డి అన్నారు. బుధవారం స్థానిక తిరుపతి రోడ్డు మార్గంలోని పలు వీధుల్లో విస్తృతంగా పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు వివరించడం తోపాటు సమస్యలు అడిగి తెలుసుకున్నారు. తమ దృష్టికి తెచ్చిన సమస్యలు అధికారులకు తెలిపి తక్షణం పరిష్కారం అయ్యేందుకు కృషి చేస్తామన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అన్ని వర్గాల ప్రజలు లబ్ధిపొందుతున్నారని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో జగన్‌ను ఆశీర్వదించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో యువ పారిశ్రామిక వెత్త జి.వి. రాకేష్‌రెడ్డి, సర్పంచ్ డాక్టర్ హబీబ్‌బాషా, కృష్ణారెడ్డి, సాంబ, నాగభూషణం, మహేష్, ఉదయ్, ఆనంద్, షఫూరా, గోవర్ధన్‌రెడ్డి, అరుణ, నరేష్‌రామ్ కుమార్‌రెడ్డి, సురేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పథకాలు పారదర్శకంగా అందించడమే లక్ష్యం



మాట్లాడుతున్న సర్పంచ్ డాక్టర్ హబీబ్‌బాషా

పీలేరురూరల్ : ప్రభుత్వ సంక్షేమ పథకాలు పారదర్శకంగా అందించడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు సర్పంచ్ డాక్టర్ హబీబ్‌బాషా అన్నారు. బుధవారం స్థానిక సీఎల్‌ఆర్‌సీ కార్యాలయం ప్రాంగణంలో సంఘమిత్రలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీలేరు గ్రామ పంచాయతీ పరిధిలో జరిగిన అభివృద్ధి, ప్రభుత్వ సంక్షేమ పథకాల గూర్చి వివరించారు. ప్రభుత్వ పథకాలు పారదర్శకంగా లబ్ధిదారులకు అందించడంలో సంఘమిత్రులు కూడా భాగస్వామ్యులు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం లక్ష్మణ్‌రెడ్డి, ఈవో ప్రసాద్‌రెడ్డి, వైస్ ఎంపీపీ ఎన్.వి. చలపతి, వైఎస్సార్‌సీపీ జిల్లా మహిళా అధ్యక్షురాలు మహిత తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణాలు వేగవంతం చేయాలి



సచివాలయ భవన నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఈఈ

పెద్దమండ్యం : గ్రామ సచివాలయాలు, వెల్‌నెస్ సెంటర్‌లు, ఆర్‌బీకే భవన నిర్మాణాల పనులు వేగవంతం చేయాలని పీఆర్ ఈఈ చంద్రశేఖర్ అన్నారు. మండలంలోని పాపేపల్లె, పెద్దమండ్యం, సీ గొల్లపల్లె, కలిచెర్ల, ఎన్‌వోపల్లె, కోటకాడపల్లె, ముసలికుంట గ్రామాలలో గ్రామ సచివాలయాలు, వెల్‌నెస్ సెంటర్‌లు, ఆర్‌బికే నిర్మాణాల పనులను బుధవారం ఆయన పరిశీలించారు. భవన నిర్మాణాల పనులు ఎక్కడవి అక్కడ ఆగిపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. ఈ విషయమై కాంట్రాక్టర్లు, అధికారులతో ఈఈ మాట్లాడారు. సెప్టెంబరు 15 లోపు భవనాల నిర్మాణాల పనులు పూర్తి చేయాలని ఆయన ఆదేశించారు. ఈఈ వెంట డీఈ విజయమోహన్, ఏఈ సందీప్ ఉన్నారు.

ఫీజుల దోపిడీ అరికట్టాలని పాఠశాలల బంద్



జెడ్పీ ఉన్నత పాఠశాల వద్ద నిరసన తెలియజేస్తున్న ఏబీవీపీ నాయకులు

మదనపల్లె సిటీ : కార్పొరేట్, ప్రైవేటు పాఠశాలలు విద్యార్థుల నుంచి అధిక ఫీజులతో దోపిడీ చేస్తున్నారని ఆరోపిస్తూ మంగళవారం ఏబీవీపీ ఆధ్వర్యంలో మదనపల్లె పట్టణంలో పాఠశాలలు బంద్ కార్యక్రమం నిర్వహించారు. పట్టణంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల మూయించి నిరసన తెలియజేశారు. ఏబీవీపనీ స్టేట్ వర్కింగ్ కమిటీ సభ్యులు సాయిహితేష్ మాట్లాడుతూ విద్యార్థుల నుంచి కార్పొరేట్ పాఠశాలలు అధిక ఫీజులతో పాటు పుస్తకాల పేరుతో దోపిడీ చేస్తున్నారని ఆరోపించారు. అనుమతులు లేకుండా నడుపుతున్న పాఠశాలలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బాగ్ కన్వీనర్ గౌతమ్‌రెడ్డి, నగర ఉప అధ్యక్షులు రెడ్డిప్రసాద్, దినేష్, రాజేష్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ సంక్షేమ ఫలాలు

- జగనన్న సురక్షలో ఎమ్మెల్యే నవాజ్‌బాషా
- స్థానిక సమస్యలపై అర్జీల స్వీకరణ



కురవంక సచివాలయంలో సర్టిఫికెట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే నవాజ్‌బాషా

మదనపల్లె : దళారీల ప్రమేయం లేకుండా పథకాలకు సంబంధించిన లబ్ధిని నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమచేస్తూ.. ప్రతి ఇంటికీ సంక్షేమఫలాలను సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అందిస్తున్నారని ఎమ్మెల్యే నవాజ్‌బాషా అన్నారు. మండలంలోని కొత్తవారిపల్లె–1, కురవంక గ్రామపంచాయతీలు, మున్సిపాలిటీలోని బర్మావీధి, నిమ్మనపల్లె రోడ్ వార్డు, బసినికొండ వడ్డిపల్లె వార్డు సెక్రటేరియట్‌ల పరిధిలో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమానికి ఎమ్మెల్యే నవాజ్‌బాషా, డీపీఓ ధనలక్ష్మి, డీఎల్‌డీఓ లక్ష్మీపతి, ఎంపీపీ రెడ్డెమ్మ, చైర్‌పర్సన్ మనూజారెడ్డి ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గతంలో ఏవేని సర్టిఫికెట్లు కావాలన్నా, ప్రభుత్వ కార్యాలయాల్లో పనులు జరగాలన్నా రోజులతరబడి కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేసి లంచాలతో పనులు జరిపించుకునే రోజులు ఉండేవన్నారు. నేడు దానికి భిన్నంగా అధికారులే ఇంటి వద్దకు వచ్చి ప్రజలకు అవసరమైన అన్ని సేవలను పారదర్శకంగా అందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ భానుప్రసాద్, కమిషనర్ ప్రమీల, సర్పంచ్‌లు బోర్‌వెల్‌మహేష్, పసుపులేటిచలపతి, మున్సిపల్ వైస్‌చైర్మన్‌లు జింకాచలపతి, నూర్‌ఆజం, వైస్ ఎంపీపీ డిష్‌రమణ, ఎంపీటీసీలు ప్రియాంక, బిల్లేహారతి, ఎంఎస్‌ఎంఈ డైరెక్టర్ ఆనందపార్థసారథి, ఎన్.ఇర్ఫాన్‌ఖాన్, వెలుగుచంద్ర తదితరులు పాల్గొన్నారు.

వాల్మీకిపురం : జగనన్న సురక్ష క్యాంపులలో ప్రజలకు ఉచితంగా 11 రకాల సేవలందిస్తున్నామని సర్పంచ్ గంగులమ్మ, ఉపసర్పంచ్ కేశవ రెడ్డి అన్నారు. బుధవారం వాల్మీకిపురం సచివాలయం 2 పరిధిలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించి, లబ్ధిదారులకు సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ షబ్బీర్ అహ్మద్, ఈవో ఉదయ్ కుమార్, ఏపీవో ప్రసాద్‌బాబు, ఆర్‌బీకే చైర్మన్ నీళ్లభాస్కర్, ఎంపీటీసీ రాజేష్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పెద్దతిప్పసముద్రం : జగనన్న సురక్ష కార్యక్రమం పేదలకు వరంలాంటిదని మండల స్పెషలాఫీసర్ శ్రీనివాసులు, ఎంపీపీ మహమూద్, జెడ్పీటీసీ శివన్న, జేసీఎస్ కన్వీనర్ డ్రిప్ రమణ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని మడుమూరు సచివాలయం పరిధిలో సర్పంచ్‌లు నాగరత్నమ్మ, రామాంజులు, ఎంపీటీసీలు ప్యారీజాన్, పద్మావతి, కోఆప్షన్ ఖాదర్‌వలితో పాటు ఎంపీడీవో గిరిధర్‌రెడ్డి, తహసీల్దార్ విద్యాసాగర్‌లు హాజరై లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలను అందజేశారు.

కలికిరి : మండల పరిధిలోని మేడికుర్తి, గుట్టపాళెం గ్రామ సచివాలయాల్లో మూడవ రోజు జగనన్న సురక్ష క్యాంప్‌లు నిర్వహించారు. ఈ సందర్భంగా కుల, ఆదాయ, కుటుంబ సభ్యుల ధృవీకరణ, బియ్యం కార్డుల్లో మార్పులు, ఆధార్ సవరణలు, ఆధార్ మొబైల్ అనుసంధానం తదితర 11 రకాల సేవలకు సంబంధించి ప్రజలకు ఉచితంగా ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. కార్యక్రమాల్లో తహశీల్దారు భాగ్యలత, ఎంపీడీఓ గంగయ్య, మండల ప్రత్యేక ఆహ్వానితుడు రత్నశేఖర్ రెడ్డి, సర్పంచ్‌లు వెంకటరెడ్డి, నాగవేణి పాల్గొన్నారు.

తంబళ్లపల్లె : సమస్యల పరిష్కారానికే జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిందని స్పెషల్ ఆఫీసర్ సందప్ప తెలిపారు. బుధవారం మండలంలోని ఎద్దులవారిపల్లె సచివాలయంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు.

ఉద్యాన రైతులకు అవగాహన సదస్సు



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న అధికారులు

గుర్రంకొండ : మండలంలోని రామాపురం ఆర్బీకేలో బుధవారం ఉద్యాన రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. మామిడితోటల్లో చెట్ల కొమ్మల కత్తరింపునకు ఇదే సరైన సమయని మదనపల్లె ఉద్యావనశాఖ ఏడీఏ రామ్మోహన్ అన్నారు. ఈసందర్భంగా మాట్లాడుతూ మామిడి చెట్లకు కొమ్మల కత్తిరింపు ప్రక్రియ జాగ్రత్తగా చేపట్టాలన్నారు. కొమ్మల కత్తరింపు అనంతరం బర్డోరో పేస్టు కోతల దగ్గర పూయాల్సి ఉంటుందన్నారు. అలాగే రైతులు యాజమాన్య పద్ధతులు పాటించాలన్నారు. సిరికల్చర్ అధికారి రసూల్ మాట్లాడుతూ మల్బరీ షెడ్ల ఏర్పాటు కోసం ప్రభుత్వం రైతులకు సబ్సిడీ ఇస్తోందన్నారు. మల్బరీ సాగులో అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. కార్యక్రమంలో వాల్మీకిపురం క్లస్టర్ ఉద్యానవనశాఖాధికారి లక్ష్మీప్రసన్న, సర్పంచ్ ఎల్లారెడ్డి, ఎంపీటీసీ గంగులమ్మ, వీహెచ్‌వో నవత, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.